
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
శుక్రవారం, 10 జనవరి 2025



నేటినుంచి మార్కెట్‌కు 6 రోజుల సెలవులు

ఖమ్మం మార్కెట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం నుంచి ఈనెల 15 వరకు ఆరురోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా, 11, 12శని, ఆదివారాలు వారాంతపు సెలవులు, 13 సోమవారం భోగి పండుగ, 14మంగళవారం మకర సంక్రాంతి, 15 బుధవారం కనుమ పండుగ సందర్భంగా సెలవులు ఉన్నట్లు తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 16 గురువారం నుంచి యధావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని తెలిపారు. వర్తకులు, కార్మికులు, రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.



భద్రాచలంలోని గోదావరిలో హంస వాహనంపై రామయ్య తెప్పోత్సవం

పరంపర నృత్య ప్రదర్శనలో కళాకారిణి హావభావ విన్యాసం

అపూర్వం అద్భుతం

భద్రాచలంలో శోభాయమానంగా కౌసల్యరాముని జల విహారం

- గోదారమ్మ ఒడిలో కనులపండువగా తెప్పోత్సవం
- పులకించిన గౌతమి తీరం
- మిరుమిట్లు గొలిపిన బాణసంచా విన్యాసాలు
- మార్మోగిన వేదఘోష, మంగళ వాయిద్యాలు
- తిలకించి పులకించిన భక్తజనం
- హాజరైన పలువురు ప్రముఖులు

భద్రాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : భక్తజన కోటి శ్రీరామనామ స్మరణ చేస్తుండగా కలహంసపైన కౌసల్య రాముని జల విహారం అత్యంత శోభాయమానంగా సాగింది. ఇందుకు వేదికగా భద్రాచంలోని పవిత్ర గౌతమి నదీ తీరం నిలిచింది. ఈ వేడుకను కనులారా తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గోదారమ్మ సైతం పులకరించింది. గోదారమ్మ ఆనందం పరవళ్ల తొక్కింది. నదీ తీరం భక్తజనంతో నిండి కనువిందు కలిగించింది. ఏటా ముక్కోటి పర్వదినానికి ముందు రోజు జరుగుతున్న గోదావరిలో హంసాలంకృత తెప్పపై సీతారామచంద్రస్వామిని విహరింపజేయడం సంప్రదాయం. ఈ ఉత్సవాన్ని తిలకించాలన్న ఆనందంతో భక్తులు భద్రాద్రికి చేరుకున్నారు. గురువారం సాయంత్రం 4గంటలకు రామాలయం నుంచి శ్రీసీతారామచంద్ర లక్ష్మణ స్వాములను (మిగతా 4వ పేజీలో)



ఉత్సవ మూర్తులను తెప్పోత్సవానికి తీసుకువస్తున్న దృశ్యం

నేడు వైకుంఠధాముని దర్శనం

- దర్శించుకోనున్న అశేష భక్తజనం
- ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి రాపత్తు ఉత్సవాలు

భద్రాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి నాడు గరుడ వాహనంపై వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించేందుకు భక్తులు ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. దీనికి కారణం శుక్రవారం వైకుంఠ ఏకాదశి పరమ పవిత్ర దినం. సకల జగత్తుకు సృష్టి, స్థితి, లయ కారకుడైన శ్రీమన్నారాయణుడికి ప్రీతిపాత్రమైనది ఈరోజు. 33కోట్ల మంది దేవతలు శ్రీమహావిష్ణువును శ్రీవైకుంఠంలోని ఉత్తరద్వారం నుంచి ఏకాదశి నాడే దర్శిస్తారు. అందుకే ఈ ఏకాదశికి ముక్కోటి ఏకాదశి అనే మరో పేరు కూడా ఉంది.

ఈ క్రమంలో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉత్తరద్వార దర్శనానికి అవసరమైన ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. డిసెంబరు 31 నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు సాగగా తొలి పది రోజులపాటు పగల్‌పత్తు ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని గురువారం రామాలయంలో తిరుమంగై ఆళ్వార్ (మిగతా 4వ పేజీలో)



పరంపర కళాకారుల నృత్య ప్రదర్శన

తెప్పోత్సవానికి హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దంపతులు, ఈవో రమాదేవి తదితరులు



సమాజానికి ఉత్తమ టీచర్లను అందించాలి...

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- డైట్ కళాశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

4



అడ్మినిస్ట్రేటివ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఇదేం కక్కుర్తి!?

- ఏసీబీ వలలో ఇల్లెందు మైనారిటీ గురుకులం ప్రిన్సిపాల్, అటెండర్
- ఔట్‌సోర్సింగ్ టీచర్ వేతనం బిల్లు చేసేందుకు లంచం డిమాండ్
- రూ.10 వేలు ఇస్తేనే బిల్లు చేస్తానని వేధింపులు
- విసుగు చెంది ఏసీబీని ఆశ్రయించిన టీచర్
- పక్కా ప్లాన్ ప్రకారం రూ.2వేలు ఇస్తుండగా పట్టుకున్న అధికారులు

4



ఏసీబీ దాడిలో పట్టుబడిన ప్రిన్సిపాల్, అటెండర్

పండుగకు ఊరెళ్తున్నారా...

చోరీలు జరగకుండా ముందు జాగ్రత్తలు అవసరం : పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మంక్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రజలు ఊరికి వెళ్లనున్న నేపథ్యంలో జిల్లాలో పోలీసు పహరా మరింతగా పెంచుతున్నట్టు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఊరికి వెళ్లే ప్రజలు ఇంటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు తమ వెంట తీసుకెళ్లాలని, లేదా బ్యాంకు లాకర్లలో దాచిపెట్టాలన్నారు. దొంగల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, రాత్రివేళ్లలో వీధుల్లో పెట్రోలింగ్, బీట్ గస్తీ ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాత్రిపూట కాలనీలతో పాటు కమిషనరేట్ పరిధిలోని బస్టాండ్, ఆటో అడ్డాలు, రైల్వేస్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

ప్రజలకు సూచనలు

- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా ఏదైనా పరదా కప్పి ఉంచాలి. మెయిన్‌డోర్ లోపలి నుంచి తాళం వేసి, పక్కడోర్లకు కూడా తాళం వేయడం మంచిది.
- ఊర్లకు వెళ్లే ఇంటిలో బంగారం, వెండి, నగదు వంటి విలువైన వస్తువులను ఉంచకుండా వెంట తీసుకెళ్లడం లేదా లాకర్లలో పెట్టడం మంచిది.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలు ఇతర సమాచారం (మిగతా 4వ పేజీలో)

ఇరిగేషన్ రిటైర్డు ఇంజనీర్

సీతారామయ్య కన్నుమూత

- వేంసూరును సస్యశ్యామలం చేయడంలో కీలకపాత్ర
- ఆరు దశాబ్దాల క్రితమే అధికారిగా రైతుల కోసం తపన
- ఖమ్మంలో నివాళులర్పించిన మంత్రి తుమ్మల

4







స్వామివారి ఊరేగింపు



స్వామివారిని దర్శించుకుంటున్న కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో



ఆకట్టుకున్న యువతుల నృత్యం

కన్నుల పండువగా తెప్పోత్సవం, ఏరు పండుగ

వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా భద్రాచలంలో గురువారం నిర్వహించిన తెప్పోత్సవం, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏరు పండుగ ఆహుతులను అలరించింది. ఇలాంటి వేడుకను చూసిన ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.



ఏరు పండుగలో గిరిజన సంప్రదాయ నృత్యం

ఓ వైపు రామయ్య జల విహారం...

మరో వైపు ఏరు పండుగ

- మంత్రముగ్ధులను చేసిన పరంపర నృత్యకళాకారులు
- ఏరు ది రివర్ ఫెస్టివల్‌తో నూతన శోభ
- భద్రాద్రి కలెక్టర్ జితేష్‌ను అభినందిస్తున్న రామభక్తులు

భద్రాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా భద్రాద్రిరామయ్యకు పవిత్ర గోదావరిలో జల విహారం ఒక వైపు సాగుతుండగా.. మరో వైపు తొలిసారి జిల్లా అధికార యంత్రాంగం నిర్వహిస్తున్న ఏరు పండుగ సరికొత్త శోభను గోదావరి నదీ తీరానికి చేర్చింది. ఏరు ది రివర్ ఫెస్టివల్ పేరిట జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రతిష్టాత్మకరంగా నిర్వహిస్తున్న మూడు రోజుల కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గోదారమ్మ సన్నిధిలో పరంపర ఫౌండేషన్ కళాకారులు చేసిన సంప్రదాయ నృత్యాలు యావత్ భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. గణపతిస్తోత్రానికి సంప్రదాయ నృత్యాలతో ప్రారంభించి అనంతరం శ్రీసీతారామచంద్రస్వామి కథను నృత్యరూపకంగా వివరించారు. ఈ సమయంలో కళాకారులు ప్రదర్శించిన హావభావాలు, నృత్యాలు ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకుముందు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక కళాకారులు చేసిన శాస్త్రీయ నృత్యాలు సైతం ప్రేక్షకులను అలరించాయి.

ఏరు ది రివర్ ఫెస్టివల్‌తో నూతన శోభ

తొలిసారిగా నిర్వహించిన ఏరు ది రివర్ ఫెస్టివల్‌తో గోదావరి నదీ తీరం వద్ద సరికొత్త శోభ ఉట్టిపడిందని రామ భక్తులు పేర్కొంటున్నారు. అశేష భక్తజనం ఎదుట ఏరు పండుగను పురస్కరించుకొని చిన్నారులు, పరంపర ఫౌండేషన్ నృత్య కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ సంప్రదాయ నృత్యరూపకంతో వారు ఎంతో భక్తి తన్మయత్వానికి లోనయ్యారు. ఈ విధంగా సంప్రదాయ, శాస్త్రీయ నృత్యాలను తెప్పోత్సవం సమయంలో నిర్వహించడం ముదావాహమని పలువురు అధికారులు సైతం అంతర్గత సంభాషణల్లో పేర్కొనడం విశేషం. ఇదే ఒరవడిని మున్ముందు సైతం కొనసాగించి తెప్పోత్సవ వేళ మరింత శోభను తీసుకురావాలని భద్రాద్రివాసులు ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా ఏరు పండుగను పురస్కరించుకొని గోదావరి







నదీ తీరాన ఏర్పాటు చేసిన 50 స్టాల్స్‌లో సైతం పర్యాటకుల సందడి కనిపించింది. ఔషధ మొక్కలను సైతం భారీ ఎత్తున తీసుకొచ్చి అతి తక్కువకు విక్రయిస్తుండటం పట్ల పలువురు అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్‌ను అభినందిస్తున్న రామభక్తులు

ఏరు ది రివర్ ఫెస్టివల్ రూపకర్త అయిన భద్రాద్రి కలెక్టర్ జితేష్‌వి పాటిల్‌ను రామ భక్తులు, భద్రాద్రివాసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. గతంలో 2002లో నాటి నేటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో అప్పటి కలెక్టర్ గిరిధర్ గోదావరి ఇసుక తిన్నెలపై భద్రాద్రి ఉత్సవాలను సాకేతపురి పేరిట నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆనాడు తెలుగువారే కాదు దేశం మొత్తం గర్వించదగ్గ ప్రసిద్ధ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యంతో పాటు ఎందరో అతిరథ మహారథులైన కళాకారులు పాల్గొనడం నేటికి స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ రెండు దశాబ్దాల తరువాత కలెక్టర్ జితేష్‌వి పాటిల్ పర్యాటక రంగానికి మరింత శోభను తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నం అభినందనీయమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాబోయే కాలంలో మరింత పకడ్బందీగా ఇటువంటి శాస్త్రీయ, సాంస్కృతిక నృత్యాలు పర్యాటక రుచులు పర్యాటక అందాలను వీక్షించేందుకు ప్రత్యేక ఫెస్టివల్స్ నిర్వహించాలని భద్రాద్రివాసులు ఆకాంక్షిస్తున్నారు.



సంప్రదాయబద్ధంగా తిరుమంగై ఆళ్వార్

పరమ పదోత్సవం



తిరుమంగై ఆళ్వారుకు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం తిరుమంగై ఆళ్వార్‌ల పరమపదోత్సవం భక్తిప్రపత్తులతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు 21 రోజులు సాగనుండగా ఇందులో తొలి పది రోజులు పగల్‌పత్తు, అనంతరం పది రోజులు రాపత్తు ఉత్సవాలు నిర్వహించనున్నారు. పగల్‌పత్తు ఉత్సవాల ముగింపు రోజున తిరుమంగై ఆళ్వార్‌ల పరమ పదోత్సవం నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

తొలినాళ్లలో పరకాలునిగా ఉన్న తిరుమంగై ఆళ్వార్ దొంగతనాలు, దారి దోపిడీలు చేసేవారు. ఈ క్రమంలో రంగనాయకస్వామి మహిమతో ఆయన మహాభక్తుడై ఆసువుగా ఆయనను స్తోత్రం చేస్తూ పెరియ తిరుమొళి అనే మహా గ్రంథంతోపాటు ఆరు ప్రబంధాలు రచించారు. దీంతో అధ్యయనోత్సవాల ఆరంభం రోజు నుంచి ప్రతి రోజు 200పాశురాలను ద్రవిడ ప్రబంధ అధ్యాపకులు పఠిస్తారు. అలాగే తిరుమంగై ఆళ్వార్ పరమపద సేవను భక్తి ప్రపత్తులతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాస రామానుజం, విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు, సంస్కృత పండితుడు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి చేరుకున్న పల్లకి పాదయాత్ర

ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా నుంచి 12ఏళ్లుగా వస్తున్న రామభక్తులు

భద్రాచలం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి మహోత్సవాన్ని కనులార వీక్షించేందుకు ఏపీలోని ఎన్‌టీఆర్ కృష్ణా జిల్లా సత్యాలపాడు నుంచి పల్లకీ పాదయాత్ర గురువారం భద్రాచలం చేరుకుంది. జైశ్రీరామ్... జైజై శ్రీరామ్ అంటూ రామనామస్మరణ చేస్తూ ఐదురోజుల క్రితం సత్యాలపాడులో శ్రీరామభక్తుల పాదయాత్ర ప్రారంభం కాగా గురువారం భద్రాచలం చేరుకొని రామయ్యను దర్శించుకున్నారు. 129కి.మీ. పాదయాత్ర చేసి తాము ఉత్తర ద్వార దర్శనాన్ని వీక్షించేందుకు వచ్చినట్టు వారు తెలిపారు. గత 12ఏళ్లగా తాము వైకుంఠ ఏకాదశి సమయంలో పాదయాత్రగా రావడం జరుగుతోందని ఇందుకు భద్రాద్రి దేవస్థానం అధికారులు సానుకూలంగా స్పందించి తమకు ప్రత్యేక దర్శనం, ఇతర ఏర్పాట్లు చేపడుతున్నారని తెలిపారు. పూర్తి కాషాయ దుస్తులను ధరించి భక్తి ప్రపత్తులతో ఈ యాత్ర ఆద్యంతం నిర్వహించినట్టు భక్తులు తెలిపారు.

ఇదేం కక్కుర్తి..?

ఇల్లెందు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఔట్‌సోర్సింగ్ టీచర్ వేతనం చెల్లించేందుకు ప్రిన్సిపాల్ రూ.10వేలు లంచం డిమాండ్ చేసి అటెండర్‌తోపాటు అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కాడు. ఈ సంఘటన గురువారం ఇల్లెందులో జరిగింది. పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ టీచర్‌గా సంధ్యారాణి విధుల్లో చేరింది. ఆమెకు ప్రతి నెల రూ.20వేల వేతనం చెల్లించడానికి ప్రిన్సిపాల్ భీమనపెల్లి కృష్ణ రూ. 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కొద్ది రోజులుగా వేతన బిల్లులు పంపించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.

దీంతో ఆమె అవినీతి నిరోధకశాఖ అధికారులకు తెలిపింది. ఏసీబీ అధికారుల వ్యూహం మేరకు ఆమె ప్రిన్సిపాల్‌ను బతిమలాడి రూ.2వేలు ఇస్తానని చెప్పింది. ప్రిన్సిపాల్ అంగీకరించడంతో ఏసీబీ అధికారుల సూచనలతో రూ.2వేల నగదు గురువారం ఉదయం తీసుకెళ్లి పాఠశాల ప్రార్థన సమయంలో (అసెంబ్లీ) ప్రిన్సిపాల్‌కు ఇవ్వబోయింది. బిజీగా ఉన్న ప్రిన్సిపాల్ డబ్బులను అటెండర్ కొచ్చెర్ల రామకృష్ణకు ఇవ్వమని చెప్పడంతో సంధ్యారాణి రూ.2వేల నగదును అటెండర్‌కుఇవ్వగా ప్రార్థన ముగిసిన తర్వాత ఆ డబ్బును అటెండర్ రామకృష్ణ ప్రిన్సి పాల్‌కు ఇచ్చాడు.. ఆ వెంటనే పాఠశాల వద్ద వేచి ఉన్న ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు దాడులు జరి పి ప్రిన్సిపాల్‌ను, అటెండర్లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రిన్సిపాల్ నుంచి రూ.2వేల నగదు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్, ప్రింటర్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రిన్సిపాల్‌పై అవినీతి ఆరోపణలు

ప్రిన్సిపాల్ కృష్ణపై అనేక అవినీతి అక్రమాల ఆరోపణలు ఉండటం గమనార్హం. డాక్టరేట్ విద్యార్హత కలిగిన కృష్ణ మైనార్టీ పాఠశాలలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ నియామకాల్లో, మెను నిర్వహణలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణల ఉన్నాయి. అయితే ఆధారాలు లేకపోవడం, సిబ్బంది ధైర్యంగా ఫిర్యాదులు చేయక పోవడంతో ప్రిన్సిపాల్ ఆడిందేఆటగా సాగింది.

అనుమతి లేకుండా వైద్యం చేయొద్దు

- డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి
- ఖమ్మం నగరంలో రెండు ప్రైవేటు క్లినిక్‌ల సీజ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్యశాఖ అనుమతి లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి హెచ్చరించారు. ఆక్యుపంచర్, కేరళ వైద్యం , హెర్బల్ క్లినిక్ అంటూ ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా ఖమ్మం నగరంలోని ట్రంక్‌రోడ్డు సమీపంలో బోర్డు పెట్టుకుని ఆస్పత్రిని నిర్వహిస్తుండగా గురువారం తనిఖీ చేసి సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ అనుమతులు లేకుండా నకిలీలు కొందరు ఆస్పత్రులు ఏర్పాటు చేసి పేద ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ప్రజలు వారి ఉచ్చులో పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఆక్యుపంచర్ ఆస్పత్రిలో డాక్టర్ గా చెప్పుకుంటున్న వై.నరేష్ కుమార్ అనే వ్యక్తికి అర్హతలు లేవని, అతను ఎక్కడ రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆనవాళ్లే లేవన్నారు. ఇతని వైద్యంతో కామేపల్లి మండలం పాతలింగాలకు చెందిన మడ్డి శ్రీనివాస్ (53) వ్యక్తి చనిపోయాడని ఫిర్యాదు రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సదరు వైద్యుడు తమిళనాడులో పుట్టి తెలంగాణలో అనేక జిల్లాలో ప్రజలను మోసం చేస్తున్నట్టు గుర్తించినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

ఇతనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో క్రి మినల్ కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రిని కూడా సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో కళావతి భాయి తెలిపారు. అలాగే ఎన్టీఆర్ సర్కిల్‌లో కేరళ వైద్యం పేరిట ఉన్న క్లినిక్ ని తనిఖీ చేసి అర్హత లేని వైద్యం నిర్వహిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చందు నాయక్, డాక్టర్ డి.రామారావు, డెమో సాంబశివ రెడ్డి, డీపీవో దుర్గ, కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అపూర్వం.. అద్భుతం..

(3వ పేజీ తరువాయి)

అందంగా అలంకరించిన పల్లకిలో భాజభజంత్రీలు, మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల కోలాటాల నడుమ గోదావరి నదికి తీసుకొచ్చారు. 4.52 నిమిషాలకు హంసాలంకృత తెప్పపై స్వామి వారిని హంసాలంకృత తెప్పపై ఆసీనులను చేసి ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వేద పఠనం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సమయంలో స్వామి వారికి ప్రత్యేక ప్రసాద నివేదన గావించారు. అలాగే హంస వాహనంకు చుట్టు బలిహరణం (పొంగలి) వేశారు. సాయం సంధ్య వేళ 6.07 సమయంలో సూర్యాస్తమయ దృశ్యం... ఓ వైపున గోదావరి నదిపై అరుణ వర్ణ కాంతి వెదజల్లుతుండగా సీతారామచంద్రస్వామి వారు హంస పాన్పుపై అలంకరించిన విద్యుద్దీపాల జిలుగుల కాంతులతో మరింత శోభాయమానమై దర్శనమిచ్చారు. వేద పండితుల వేద పఠనం, మంగళవాయిద్యాలతో స్వామి వారిని గోదావరి నదిపై విహరింపజేయడం, మరోవైపు బాణసంచా కాల్పుల మోతతో నదీ తీరం హోరెత్తించింది. ఈ తెప్పోత్సవ వైభవం భక్తులను పులకరింపజేసింది. మంగళహారతి అనంతరం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని గోదావరి నదీ తీరం నుంచి ఆలయానికి తిరువీధి సేవగా తీసుకెళ్లారు.

తెప్పోత్సవం కార్యక్రమంలో భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, వరంగల్ అడిషనల్ ఏఎస్పీ బి.అశోక్‌కుమార్, భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఈఏవోలు శ్రవణ్ కుమార్, భవానీ రామకృష్ణారావు, భద్రాచలం ఆర్డీవో కె.దామోదరరావు, తహసీల్దారు పీవీ రామకృష్ణ, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వైదిక సిబ్బంది, దేవస్థానం ఇంజనీరింగు ఈఈ దయాకర్‌రెడ్డి, డీఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకుడు భవానీరామకృష్ణారావు పాల్గొన్నారు.

నేడు వైకుంఠధాముని దర్శనం

(3వ పేజీ తరువాయి)

పరమపదోత్సవం, వేద పఠనం గావించారు. కాగా సాయంసంధ్య వేళ పవిత్రగౌతమీలో శ్రీసీతారామచంద్రస్వామి వారి హంసాలంకృత తెప్పపై ప్లవోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.

శుక్రవారం తెల్లవారుజామున ఉత్తరద్వారంలో వైకుంఠ రాముడు భక్తులకు దర్శనమివ్వనుండటంతో అందుకు అనుగుణంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణలు, సెక్టార్ల ఏర్పాటుతోపాటు శ్రీరామనామంతో రామాలయం పరిసరాలు మారుమ్రోగుతున్నాయి. ఇదిలా ఉండగా శుక్రవారంనుంచి రాపత్తు ఉత్సవాలు ప్రారంభం కానుండగా తొలి రోజున ఏఎస్పీ బంగ్లాలోని శ్రీరామరక్షా మండపంలో నిర్వహించనున్నారు. జనవరి 20వరకు రాపత్తు ఉత్సవాలు నిర్వహించనుండగా అదే రోజు అధ్యయనోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. జనవరి 21 నుంచి 23వరకు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు. కంచర్ల గోపన్నగా ప్రసిద్ధిగాంచిన భక్తరామదాసు పాల్వంచ పరగణాకు తహసీల్దారుగా ఉన్న కాలం నుంచి వస్తున్న సంప్రదాయంలో భాగంగా వైకుంఠ ఏకాదశి నాడు ముందుగా స్థానిక తహసీల్దారు ముందుగా ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించి మేళతాళాలు, భాజభజంత్రీల మధ్య రామాలయం నుంచి ఉత్తరద్వారం వైపు స్వామిని తీసుకురానున్నారు. సరిగ్గా ఐదు గంటల సమయంలో స్వామివారు వైకుంఠ రామునిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారిని రాజవీధి, తాతగుడి సెంటరు, అంబాసత్రం, బ్రాహ్మణ బజారుల మీదుగా స్వామి వారి తిరువీధి సేవ నిర్వహించనున్నారు.

ఈ సమయంలో వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించనున్నారు.

సమాజానికి ఉత్తమ టీచర్లను అందించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డైట్ కళాశాలలో అభివద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని డైట్ కళాశాల ద్వారా నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేసి సమాజానికి అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, నగరంలోని ఏడవ డివిజన్ టేకులపల్లిలో పర్యటించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటివ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ డైట్ కళాశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప టీచర్లుగా తయారు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి సంవత్సరం ఖాళీ అవుతున్న టీచర్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామని అన్నారు. డైట్ కళాశాల కాంపౌండ్ గ్రినరీ తో పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ, డీఈవో సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రిటైర్డు ఇంజనీర్ సీతారామయ్య కన్నుమూత

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటి పారుదలశాఖలో పర్యవేక్షక ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహించి, పదవీ విరమణ పొందిన తక్కిళ్లపాటి సీతారామయ్య(90) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుటాహుటిన ఖమ్మం నెహ్రూనగర్‌లోని సీతారామయ్య నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. మేయర్ పునుకొల్లు నీరజ కూడా కుటుంబాన్ని పరామర్శించారు. సీతారామయ్య సేవలను ఎన్నటికీ మరువలేమని, ముఖ్యంగా వేంసూరు మండలంలో రైతుల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచి ఉంటారని మంత్రి తుమ్మల అన్నారు. వేంసూరు మండలంలో రైతులు నిత్యం కరువు కాటకాలను ఎదుర్కొంటున్న క్రమంలో బేతుపల్లి పెద్ద చెరువు మిగులు నీటిని మండలంలోని చెరువులకు మళ్లించేందుకు 1968లోనే రూపకల్పన చేశారని, ఆయన స్ఫూర్తితో ఆ కాలువను తాను పూర్తి చేయించానని గుర్తు చేసుకున్నారు. నేడు వేంసూరు మండలంలోని రైతులు సాగునీటి కొరత లేకుండా పంటలు పండిస్తున్నారని చెప్పారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

పండుగకు ఊరెళ్తున్నారా..

(3వ పేజీ తరువాయి)

వంటివి ఎవరితో పంచుకోవద్దు.

- ఊరి వెళుతూ ఇంటి పక్కవారికి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలి. రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు పోలీసులు ఇంటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. రాత్రి సమయంలో ఏదైనా ఒక రూంలో లైటు వెలుగుతనే ఉండేలా చూడాలి

-అనుమానిత వ్యక్తులు ఇంటిచుట్టు తిరగడం కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి

- మొబైల్‌కు నోటిఫికేషన్‌కు వచ్చేలా ఇంటికి సీసీ కెమేరాలు అమర్చి ఇంటి బయట నాలుగువైపులా కవరయ్యేలా కెమరాలు అమర్చుకోవాలి.

- ఇంటిలో ఎవరైన మహిళలు , వృద్దులు వద్దకు వచ్చి అపరిమితుల సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని చెప్పాలి.

మధిరలో ఆపరేషన్ ఆకర్ష్

- అన్ని పార్టీల నాయకులకు కాంగ్రెస్ గాలం
- నేడు భట్టి సమక్షంలో ఎర్రుపాలెం మండలంలో 3వేల మంది చేరిక

మధిరటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆపరేషన్ ఆకర్ష్ కార్యక్రమాన్ని చేపట్టింది. వివిధ పార్టీల నుంచి భారీగా చేరికలు ఉండేలా తన అనుచర గణానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. దానిలో భాగంగానే శుక్రవారం ఎర్రుపాలెం మండలంలో మాజీ జడ్పీటీసీ చావా రామకృష్ణతో పాటు ఆయన సతీమణి మాజీ ఎంపీపీ అరుణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంబి సాంబశివరావు మరికొందరు కీలక నాయకులతో పాటు వివిధ పార్టీల నుంచి దాదాపు మూడు వేల మంది కాంగ్రెస్‌లో చేరనున్నారు. చేరికల కోసం భట్టి విక్రమార్క ఎర్రుపాలెం మండలం సఖినవీడు గ్రామానికి రానున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరుగు లేని శక్తిగా నిలిపేందుకు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ఓటుబ్యాంకే లక్ష్యంగా ఆయన అనుచరులు గ్రామాల్లో తిరుగుతూ నాయకులతో పాటు ద్వితీయశ్రేణి క్యాడర్‌తో మంతనాలు సాగిస్తున్నారు. పార్టీలో చేరేందుకు ఎటూ తేల్చుకోలేక పోతున్న వారితో భట్టి సతీమణి స్వయంగా మాట్లాడుతుండగా అవసరమైతే కొందరు కీలక నేతలను ఏకంగా భట్టితోనే మాట్లాడిస్తున్నారు.

ఎర్రుపాలెం చేరికల తరువాత బోనకల్‌లో వెయ్యి మందితో చేరికల కార్యక్రమానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఆ తరువాత మధిర పట్టణంతో పాటు రూరల్‌లో చేరికల కు వేదికను ఖరారు చేసే పనిలో ఉన్నారు. చింతకాని మండలంలో మాజీ జడ్పీటీసీతో పాటు మరికొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తుండటంతో వా రితో పాటు మరికొందరు కీలక గ్రామస్థాయి నాయకులతో మంతనాలు పూర్తి చేసిన తరువాత చేరికలకు వేదికను నిర్ణయించనున్నారు. ముదిగొండ మండలంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిచూపి తరువాత విరమించుకున్న కీలక ప్రజాప్రతినిధి తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపిస్తుండటంతో ముదిగొండ మండలంలో క్లీన్‌స్వీప్ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలుపుతున్నారు.

ముక్కోటి దేవతలు ఒక్కచోటుండే రోజు..

- నేడు ముక్కోటి ఏకాదశి
- దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు
- ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తు



స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఆలయాల్లో సకల ఏర్పాట్లు చేశారు. ఖమ్మం నగరంలోని వెంకటేశ్వరస్వామి, సీతారామ, అంజనేయ, రంగనాధస్వామి దేవాలయాలు, స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి తదితరదేవాలయంతోపాటు జిల్లా వ్యాప్తంగా గల వైష్ణవ ఆలయాల్లో భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక భక్తిసాంస్కృతిక కార్యక్రమాలు, తదితర చోట్ల అధికంగా జనం గుమికూడి తొక్కిసలాటలు జరుగుతూ ప్రమాదాలు సైతం తలెత్తుతుండటంతో ఈ ఏడాది ముందస్తు జాగ్రత్తగా దేవాలయాల్లో ప్రత్యేక భద్రత పాటిస్తున్నారు. దేవాలయాలు ఎవరికి వారు ప్రత్యేకంగా ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవటం తోపాటు పోలీస్ శాఖ సైతం ప్రత్యేకంగా సిబ్బందిని పంపనుంది. ఇందులో భాగంగా ఇద్దరు నుంచి నలుగురు వరకు ప్రైవేటు సెక్యూరిటీ తోపాటు ఇద్దరు పోలీసు సిబ్బందితో క్యూలైన్ల భద్రత పర్యవేక్షించనున్నారు. హైదరాబాద్‌లో సంధ్యా థియేటర్ ఘటన, మరువక ముందే తిరుమలలో బుధవారం జరిగిన తొక్కిసలాటలో ప్రమాదం తలెత్తినందున ఆలయాల వద్ద ప్రత్యేక భద్రతకు ప్రాధాన్యమిస్తున్నారు. ముక్కోటికి సైతం ఒక దేవాలయానికి భక్తులు పది వేల నుంచి ఇరవై వేల మంది వరకు హాజరవుతారని అంచనా వేస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేయనున్నారు. ఇందులో భాగంగా పటిష్ఠంగా మరింత పొడవున క్యూలైన్ల ఏర్పాటు, వంటివి పాటించాలన్న నిబంధనలను ఆచరించనున్నారు.

వైకుంఠ ఏకాదశి ప్రాశస్త్యం

ముక్కోటి రోజు తెల్లవారు ఝామున స్వామి వారిని దర్శిస్తే ముక్కోటి దేవతలను దర్శించిన పుణ్యం లభిస్తుందన్న నమ్మిక కావటంతో భక్తులు ఆలయాలకు పోటెత్తుతారు. ఏడాదికి 24 ఏకాదశులు ఉన్నప్పటికీ సూర్యుడు ఉత్తరాయనానికి మారేముందు వచ్చే ధనుర్మాసశుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి అని పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠం వాకిళ్లు తెరుచుకొని ఉంటాయన్న సంకేతార్థంతో వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శణ భాగ్యం కల్పిస్తారు. మహావిష్ణువు ముక్కోటి నాడు గురుడ వావనధారుడై ముక్కోటి దేవతలతో కలిసి భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శణమిస్తాడన్న నమ్మకంతో భక్తులు వైష్ణవ ఆలయాల వద్ద తెల్లవారు ఝామునుంచే వేచి ఉంటారు. వైకుంఠ ఏకాదశికి మూడు కోట్ల ఏకాదశులతో సమానమైన పవిత్రత ఉందన్న భావనతో భక్తులు ప్రత్యేక పూజలు పాటిస్తారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆలయాలకు సున్నాలు, పెయింటింగ్‌లు వేయటంతోపాటు మంగళతోరణాలు, విద్యుత్ బల్బులతో అలంకరించారు. అర్ధరాత్రి రెండు గంటలనుంచే భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అభిషేకాలు, ఆండాళ్ అమ్మ వారికి పల్లకి సేవ, ఉత్తరద్వార దర్శనాలు, గ్రామోత్సవాలు జరుపుతారు.

క్రైం సమాచారం

గుర్తుతెలియని వాహనం ఢీకొని కౌలురైతు మృతి



రామారావు (ఫైల్)

కొణిజర్ల, జనవరి9 (ఆంధ్రజ్యోతి): చేనుకు నడుచుకుంటూ వెళ్తున్న కౌలురైతును గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన సంఘటన మండల పరిధిలోని అంజనాపురం సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానిక స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపిన వివరాలు ప్రకారం అంజనాపురం గ్రామానికి చెందిన అజ్మీర రామారావు(50) అనే కౌలు రైతు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఆ భూమిలో మొక్కజొన్నను వేశాడు. తెల్లవారుజామున సమయంలో పంటకు నీళ్లు పెట్టడానికి ఇంటి నుంచి చేనుకు కాలినడకన వెళ్తుతుండగా మార్గమధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దాంతో అతడు తీవ్రగాయాలతో అక్కడకు అక్కడే మృతి చెందాడు. స్థానికులు ద్వారా విషయం మృతుడి ఇంటికి, పోలీస్‌లకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడుకి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ మృతి

ఖమ్మంరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ వాహనంలోనే మృతి చెందిన ఘటన గురువారం ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులో జరిగింది. ఏపీలోని కర్నూలు జిల్లా మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన చాకలి త్యాగమూర్తి(46) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మేడ్చల్‌లోని పైపుల ఫ్యాక్టరీలో బుధవారం పైపులను లోడు చేసుకుని జనగామలో వాటిని అన్‌లోడ్ చేశాడు. అక్కడినుంచి ఖమ్మానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్‌రోడ్డుకు చేరుకునేవరకు రాత్రి కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి అందులోనే రాత్రి నిద్రపోయాడు. ఉదయం ఆ డీసీఎం ఓనర్ లక్ష్మయ్య డ్రైవర్ త్యాగమూర్తికి ఫోన్ చేయగా ఎంతకీ ఫోన్ ఎత్తలేదు. దీంతో ఖమ్మంలో ఉన్న తమ డీలర్ సాయిధీరజ్‌కు ఫోన్ చేసి వరంగల్ క్రాస్‌రోడ్డులో డీసీఎం ఉందని, డ్రైవర్ త్యాగమూర్తి ఫోన్ ఎత్తడంలేదని వెంటనే వెళ్లి మాట్లాడించాలని సూచించాడు. దీంతో ధీరజ్ వెళ్లి డీసీఎంలో చూడగా త్యాగమూర్తి అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే 108కు ఫోన్ చేయగా వారు వచ్చి పరిశీలించి అతడు గుండెపోటుతో మృతి చెందాడని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘట నా స్థలానికి వచ్చి అన్నం శ్రీనివాస్ బృందం సహాయంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా: ఇద్దరికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యిన సంఘటన గురువారం మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లి గ్రామానికి చెందిన గఫూర్, కూసుమంచికి చెందిన తరుణ్ కలసి రుద్రంపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లోమా పరీక్ష రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈ క్రమంలో పడమటనర్సాపురంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని క్రాస్ చేస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో తరుణ్ కుడి చెయ్యి విరగగా, గఫూర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి ప్రమాద వివరాలను నమో దు చేసుకున్నారు. క్షతగాత్రులకు చికిత్స కోసం జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స అందించేందుకు 108లో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎయిడ్ టు వాలంటరీ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలి

● గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్ టు వాలంటరీ సంస్థలు ఫిబ్రవరి15 లోగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధికోసం పనిచేస్తున్న (ఎయిడ్ టు వాలంటరీ ఆర్గనైజేషన్) ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థల నుంచి ఈ ఏడాదికి దరఖాస్తులు కోరుతున్నట్లు, అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్ కాపీలను ఉప సంచాలకులు, గిరిజన సం క్షేమ శాఖ, ఖమ్మంకార్యాలయంలో అందించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

కారేపల్లి జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతచెన్నంగులగడ్డ గ్రా మంలో బంతుల సంతోష్ అనే వ్యక్తికొ సంబంధించిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని కారేపల్లి పోలీసులకు అప్పగించారు. ఇల్లెందు మండలం లచ్చగూడేనికి చెందిన సంతోష్ పాత చెన్నంగులగడ్డలోనే ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వచేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఆలయంలో చోరీ

అశ్వారావుపేట రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లవారిగూడెంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని అపహరించారు. ఆలయానికి దూరంగా హుండీని పగలగొట్టి అందులోని నగదును చోరీ చేశారు. హుండీలో దాదాపు రూ.40వేల వరకు ఉండవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

సహకార సంఘాలు బలోపేతం చేస్తాం

- రాయితీపై వ్యవసాయ పరికరాలు
- త్వరలో రైతు భరోసా
- మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

తల్లాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి రాయితీపై రైతులకు అన్నిరకాల వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తామని వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం తల్లాడ మండలం నూతనకల్ గంగదేవిపాడులో సొసైటీ నూతన కార్యాలయం, గోదాము భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త సహకార సంఘాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. వచ్చే వానాకాలం వ్యవసాయ సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలుచేస్తామన్నారు. బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్ని ఇచ్చే ఆయిల్ పామ్ వంటి పంటలను సాగుచేయాలని సూచించారు. రాష్ట్రంలో రూ.రెండులక్షల రుణమాఫీ చేశామని, త్వరలో ఎకరాకు రూ.12వేల చొప్పున రైతుభరోసా ఇస్తామన్నారు. రైతుబీమాను కొనసాగిస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు కృషి జరుగుతుందని ఇది తన జీవిత ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. తొలకరిలో ఎన్నెస్పీ జలాలు రాకపోయినా గోదావరి జలాలతో పొలాలకు సాగునీరందించటం జరుగుతుందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని దాని నుంచి బయటపడేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు దొండపాటి వెంకటేశ్వరరావు, కొత్వాల శ్రీనివాసరావు, సీఈవో వెంకటాదిత్య, డీసీవో గంగాధర్, ఆర్డీవో రాజేంద్రగౌడ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్లు తూము వీరభద్రరావు, దిరిశాల నర్సింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం



టెన్నిస్ పోటీని ప్రారంభిస్తున్న చీఫ్ ఇంజనీర్ శ్రీరామ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో, డిస్కమ్స్ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, లాన్‌టెన్నిస్ పోటీలు గురువారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైనాయి. పోటీలను వరంగల్ జోన్ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీరామ్‌కుమార్ ప్రారంభించారు. నగరంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఫుట్‌బాల్ విభాగంలో 8 జట్లు, టెన్నిస్ విభాగంలో 9 జట్లు పాల్గొన్నాయి. సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ బి. శ్రీనివాస్, ట్రాన్స్‌కో స్పోర్ట్స్ అధికారి ఎన్. జగన్నాథ్, స్పోర్ట్స్ సెక్రెటరీ ఏడీఈ బాబూనాయక్, డీఈలు నాగరత్నం, క్రిష్ణారావు, ఈఈలు దాసు, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవల ఫీడ్‌బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్

- ఖమ్మం సీపీ సునీల్‌దత్
- ప్రజలు సేవలు వినియోగించుకోవాలని సూచన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పనితీరు, వారిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటు చేసినట్టు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను సీపీ తన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. బాధితులు సమస్యలు విన్నవించేందుకు స్టేషన్లకు వెళ్లిన అనంతరం పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు, పాస్‌పోర్టు వెరిఫికేషన్, ఈ-చలాన్, ఎఫ్ఐఆర్ వంటి సేవల గురించి పోలీస్ సిబ్బందిపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు ఈ క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. ఈ పోస్టర్లు సీపీ కార్యాలయంతో పాటు ఏసీపీ, సీఐ కార్యాలయాలు, అన్ని పోలీస్‌స్టేషన్లలో స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్‌ను ప్రజలు సద్వినియోగించుకోవలాని సూచించారు. అదేవిధంగా డీజీపీ కార్యాలయం నుం చి వీడియోకాన్ఫరెన్సు ద్వారా గురువారం జరిగిన సమావేశంలో డీజీపీ జితేందర్ ఈ క్యూర్ కోడ్ పోస్టర్లను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసులు అమలుచేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఏఐయూకేఎస్ నిరసన



ఆందోళన చేస్తున్న ఏఐయూకేఎస్ నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశలవారీగా నిర్వీర్యం చేసి కార్పొరేటీకరణ దిశగా మార్పులు చేస్తున్నాయని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జాతీయ నాయకుడు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి నిరసన దీక్ష చేశారు. అచ్చయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ఆదుకొనేందుకు స్వామినాథన్ సిఫారస్సుల మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టబద్ధత తేవాలన్నారు. మోదీ ప్రభుత్వం రద్దుచేసిన మూడు చట్టాలను పరోక్షంగా అమలుచేసేందుకు కార్పొరేట్ శక్తులతో చేతులు కలుపుతున్నారని ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించటమే వ్యవసాయ రంగానికి ప్రభుత్వాలు అందించే రక్షణ చర్యలుగా ఉంటాయని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, విత్తన సబ్సిడీలను అమలు చేయాలని కోరారు. రుణమాఫీ అమలు కాని రైతులకు ఎకరాకు రూ. 15వేలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, లక్ష్మణ్, పాశం అప్పారావు, గుగులోత్ తేజనాయక్, ధరావత్ లక్ష్మణ్; భాస్కర్, మారుతి మల్లయ్య, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఒగ్గు నాగిరెడ్డి, జరుపల దేవ్లా, గుణగంటి వీరబాబు, సోములు పాల్గొన్నారు.

కరువుపై పోరులో ఘనాపాటి 'తక్కెళ్లపాటి'

- వేంసూరు కరువుకు పరిష్కారం చూపిన ఇంజనీర్
- బేతుపల్లి పెద్ద చెరువు మిగులు నీరు మళ్లింపునకు సర్వే
- సాగునీటితో 45వేల ఎకరాల్లో పంటల సాగు



ఎన్టీఆర్ ప్రత్యామ్నాయ కాలువ



సీతారామయ్య (ఫైల్)

సత్తుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కరువుకు పరిష్కారం చూపిన ఇంజనీర్‌గా నీటి పారుదల శాఖ విశ్రాంత ఎస్ఈ తక్కెళ్లపాటి సీతారామయ్య(90)... వేంసూరు ప్రాంత రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. బుధవారం రాత్రి సీతారామయ్య ఖమ్మంలో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఆయన కృషిని భిన్నవర్గాల వారు గుర్తు చేసుకుంటున్నారు. సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు నుంచి మిగులు నీటిని కాలువల ద్వారా వేంసూరు మండలానికి మళ్లించవచ్చని ఆరు దశాబ్దాల క్రితమే గుర్తించిన సీతారామయ్య... సర్వే జరిపించి ప్రణాళిక రచించారు. 1968లో మొదలైన మిగులు నీటి మళ్లింపు పథకం 1997లో పూర్తయి వేంసూరు మండలంలో సాగునీరు చెరువులకు చేరింది. మిగులు నీటి మళ్లింపు కాలువ నిర్మాణం ముందు ఆ తరువాత అనేక సాంకేతిక, ఆర్థిక అవాంతరాలను ఎదుర్కొని ఎట్టకేలకు వేంసూరు మండలం బేతుపల్లి చెరువు మిగులు నీటితో సస్యశ్యామలమైంది.

వేంసూరు మండలానికి ఒకవైపున తమ్మిలేరు, మరోవైపు కట్టలేరు ప్రవహిస్తున్నాయి. మధ్యన మండలంలో వ్యవసాయ భూములు ఉన్నప్పటికీ వర్షాధారమే రైతులకు మార్గంగా ఉంది. దీంతో దశాబ్దాల కాలం సాగునీరు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. పరిస్థితిని గమనించిన వేంసూరుకు చెందిన తక్కెళ్లపాటి సీతారాములు (సీతారామయ్య) 1958లో నీటిపారుదల శాఖ ఏఈగా బాధ్యతలు తీసుకొని వివిధ హోదాల్లో పనిచేస్తూ 1968నాటికి బేతుపల్లి పెద్ద చెరువు నీరు అలుగు ప్రవహించే సమయంలో వృథాగా తమ్మిలేరులో కలుస్తుందన్న విషయాన్ని గుర్తించారు. బేతుపల్లి మిగులు నీరు సగటున 3500 క్యూసెక్కులు వృథాగా పోతుందని గమనించి వరదనీటిని వేంసూరు మండలంలోని చెరువులకు మళ్లించే విషయంపై ఆలోచన చేశారు. దీనికి సంబంధించి అప్పట్లో సర్వే జరిపించి కాలువల ద్వారా నీటిని వేంసూరు మండలంలోని చెరువులకు మళ్లించవచ్చునని నిర్ధారించుకున్నారు. అప్పట్లో ఆయన నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ ఉండటంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేశారు.

1971లో శంకుస్థాపన..

సీతారామయ్య ఆలోచన మేరకు ప్రభుత్వం వేంసూరు మండలానికి బేతుపల్లి పెద్ద చెరువు మిగులునీటిని మళ్లించేందుకు కాలువల తవ్వకానికి నిధులు కేటాయించింది. రూ.26లక్షల అంచనా వ్యయంతో పథకాన్ని మంజూరు చేయగా 1971లో శీలం సిద్దారెడ్డి మంత్రిగా శంకుస్థాపన చేశారు. ఆ తరువాత దీనిని పట్టించుకున్న వారు లేరు. 1986లో తుమ్మల నాగేశ్వరరావు చిన్నతరహా నీటిపారుదల శాఖమంత్రిగా వరదనీటి కాలువను మంజూరుచేసి యూరోపియన్ ఆర్థిక సమాజం నిధులు రూ.3కోట్లు మంజూరు చేసి తిరిగి పనులు ప్రారంభించారు. 1989వరకు పనులు జరిగి నిలిచిపోయాయి. 1994లో గెలుపొందిన తుమ్మల నాగేశ్వరరావు 1995నుంచి కాలువ పనులు పునఃప్రారంభించి 1997లో ప్రారంభించి ఎన్టీఆర్ కెనాల్‌గా నామకరణం చేసి వేంసూరు మండలానికి సాగునీటిని అందించారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ కారణంగా ఈ కాలువ పూడిపోతూ ఉండటంతో ప్రత్యామ్నాయ కాలువను నిర్మించారు. 2004నుంచి 2014వరకు ప్రత్యామ్నాయ కాలువ పనులు జరుగుతూనే ఉండగా 2014లో మంత్రి అయిన తుమ్మల పనులు పూర్తి చేయించి 2015లో ప్రారంభించారు. అప్పటి నుంచి బేతుపల్లి పెద్ద చెరువు మిగులు నీరు వేంసూరు మండలంలోని 50చెరువులకు సమృద్ధిగా చేరుతున్నాయి. ప్రస్తుతం 44,680ఎకరాలలో వరితో పాటు ఉద్యానవన పంటలు కూడా సాగు చేస్తున్నారు. సీతారామయ్య 1993లో ఎస్ఈగా ఉద్యోగ విరమణ చేశారు. ఆయన మృతితో రైతులు విషాదంలో మునిగిపోయారు.



పండుగకు ఊరెళితే.. పోలీసులకు సమాచారం ఇవ్వండి

నేలకొండపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఊరెళ్లే వారు తమ అడ్రస్, ఫోన్ నెంబర్ పోలీసులకు ఇవ్వాలని నేలకొండపల్లి ఎస్ఐ పెంటరి సంతోష్ సూచించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటి తాళాలతో పాటుగా విలువైన వస్తువులను వెంట తీసుకెళ్ళాలన్నారు. వాహనాలను రోడ్డుపైన గాకుండా ఇంటి ఆవరణలో పార్కు చేయాలని, కారు డిక్కీల్లో ఎటువంటి విలువైన వస్తువులు ఉంచరాదన్నారు. ఊరెళ్లె విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయటం వల్ల ఇంటిలో ఎవ్వరూ లేని విషయం అందరికీ తెలుస్తుందన్నారు. కావున సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని ఎస్ఐ హితవు పలికారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పెంటరి సంతోష్

'చెత్త'శుద్ధి కరువు!

కాసులు కురిపించే పనులపైనే కదలిక

డంపింగ్‌యార్డు, పార్కుల నిర్వహణపై నిర్లక్ష్యం

లకారం ట్యాంక్‌బండ్‌కు గంజాయి మూకల బెడద

కాంట్రాక్టర్లకు అనుకూలంగా కొత్త ప్రతిపాదనలు

కేఎంసీలో గాడి తప్పిన ఇంజనీరింగ్ విభాగం



ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి9(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరపాలకంలో పారిశుధ్యం, క్లీన్‌అండ్ గ్రీన్ నిర్వహణలో చిత్తశుద్ధి కరువైంది. ఇంజనీరింగ్ విభాగ అధికారులు తమకు కాసులు కురిపించే పనులపై దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఆహ్లాదం పెంచే పార్కులు, పారిశుధ్య నిర్వహణలో ఎంతో కీలకమైన డంపింగ్ యార్డు నిర్వహణపై కనీసం చిత్తశుద్ధి చూపకపోవటంతో పార్కులకు వెళ్లిన పిల్లల నుంచి వాకింగ్‌కు వెళ్లిన వృద్ధుల వరకు నగరపాలకసంస్థ పనితీరుపై పెదవి విరుస్తున్నారు.

గంజాయి మూకల బెడద

నగర ప్రజలు సాయంత్రం వేళ ప్రశాంతత కోసం లకారం ట్యాంక్‌బండ్‌కు వెళ్తారు. అయితే రెండు నెలలుగా అక్కడ గంజాయి మూకల బెడద ఎక్కువైంది. ట్యాంక్‌బండ్‌కు చెర్వుబజార్ రహదారికి మధ్యలో ఉన్న ఖాళీప్రదేశంలో రాత్రి 11గంటల వరకు గంజాయి మూకలు మకాం వేస్తున్నాయి. ఆ ప్రాంతంలో మద్యం, గంజాయి తాగి పేకాట ఆడుతున్నారు. లకారం ట్యాంక్ బండ్‌పై చిరు వ్యాపారులు తన ఇళ్లకు వెళ్లిన తర్వాత దుకాణాల తాళాలు పగలగొట్టి వాటిలోని ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్ దొంగిలిస్తున్నారు. ఇటీవలి కాలంలో లకారం ట్యాంక్‌బండ్‌పై నాలుగు దుకాణాల్లో చోరీ జరిగింది.

డంపింగ్‌యార్డు నిర్వహణపై చిత్తశుద్ధి కరువు

ఖమ్మంనగరపాలక సంస్థ పర్యవేక్షణలో డంపింగ్ యార్డు నిర్వహణ కొనసాగుతోంది. యార్డులోని యంత్రాలకు అవసరమైన పరికరాలు, టైర్లు, నిర్వహణ వస్తువులను ముందస్తుగా ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ డంపింగ్‌యార్డులోని ఎక్స్‌కవేటర్ రెండు టైర్లు పగిలి మూలకు చేరే వరకు కొత్త టైర్లు తెప్పించలేదు. డంపింగ్‌యార్డులో నాటిన మొక్కలకు సరైన పైప్‌లైన్ లేకపోవటంతో 300చెట్లు ఎండిపోతున్నాయి.

కాంట్రాక్టర్లకు అనుకూలంగా ప్రతిపాదనలు

ఖమ్మం నగరపాలక సంస్థలో రూ.1లక్షకు పైగా ఏ పనులు చేసినా ప్రతి పని టెండర్ విధానంలోనే కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ మేరకు అతను చేసే పని నాణ్యతాప్రమాణాలతో నిర్ణీత కాలవ్యవధి నిర్ణయించబడి ఉంటుంది. లకారం ట్యాంక్ బండ్ నుంచి ఓపెన్ జిమ్‌లు, డంపింగ్ యార్డు వరకు ప్రతి పనిలో ఇదే నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే లకారం ట్యాంక్ బండ్‌పై సీసీ కెమెరాలు పనిచేయకపోవటంతో గంజాయి మూకలు బెడద పెరిగిందని వ్యాపారుల నుంచి ప్రజల వరకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌తోనే నిర్వహణ చేయించాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అలా కాకుండా కొత్తగా కెమెరాలు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఓపెన్ జిమ్‌లు, పార్కులు, డంపింగ్ యార్డులో కాంట్రాక్టర్లు పనులు చేసిన సమయంలో నాణ్యత పరిశీలించకుండా బిల్లులు మంజూరు చేసిన అధికారులు ఆ వ్యవహారం తమ మెడకు చుట్టుకోకుండా కొత్త ప్రతిపాదనలు చేసి మంజూరులు ఇస్తూ ఖమ్మం నగర పాలక సంస్థపై ఆర్థిక భారం మోపుతున్నారు.

మా దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తున్నాం
కృష్ణలాల్, ఈఈ, కేఎంసీ

నిబంధనల మేరకు ఇంజనీరింగ్ అధికారులు పనులు పర్యవేక్షణ చేయాలి. నాణ్యతలో రాజీ పడేది లేదు. ఓపెన్ జిమ్‌లు, లకారం ట్యాంక్ బండ్, పార్కుల సమస్యలు మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తున్నాం. డివిజన్లు వారీగా ఇంజనీరింగ్ అధికారులకు బాధ్యతలు కేటాయించాం. లకారం ట్యాంక్‌బండ్‌పై సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తాం.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	18 రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	38
కాకరకాయ	58
బెండకాయ	58
పొట్లకాయ	38
దోసకాయ	28-44
చిక్కుడు	68
నాటుచిక్కుడు	90
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	66-70
సొరకాయ	20
క్యారెట్	44
క్యాప్సికం	54
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	మ్యాక్స్
సాయిరాం:	డ్రింకర్‌సాయి/యూఐ
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

పాఠశాలకు బీరువాల వితరణ

ఖమ్మంరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జలగంనగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు బీరువాలు, లైబ్రరీ పుస్తకాలు, పుస్తకాల ర్యాక్, సౌండ్ సిస్టమ్, రాజీవ్ గృహకల్ప, నయాబజార్ వివిధ పాఠశాలలకు రూ.50వేల విలువైన వస్తువులను గురువారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి కే.రవికుమార్, ప్రధానోపాధ్యాయులు శాంసన్, తదితర ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నియామక అక్రమాలపై విచారణ జరిపించాలి

ఖమ్మంటౌన్,జనవరి9(ఆంధ్రజ్యోతి):గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో ఔట్‌సోర్సింగ్ నియామకాల అక్రమాలపై విచారణ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీ.ప్రవీణ్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్యభవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి శేష అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ముఖ్యకార్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు వినోద్, మనోజ్, త్రినాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న సభ్యులు

నేలకొండపల్లి,జనవరి9(ఆంధ్రజ్యోతి): యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోనాయగూడెంలో 90మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎన్నారై గేరా కార్తీక్ హాజరయ్యారు. వైఎంసీఏ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎంసీఏ జిల్లా అధ్యక్షుడు బి.జి.క్లెమెంట్, కార్యదర్శి సుధాకర్, పిల్లి విజయ్‌పాల్, కందుల ఉపేందర్, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ జంగం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణం చేయాలి

» మంత్రి తుమ్మలకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం బాధ్యుల వినతి



మంత్రి తుమ్మలకు వినతి పత్రం అందిస్తున్న అథ్లెటిక్స్ సంఘ బాధ్యులు

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి9(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 8వరసల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణ పనులను వేగిరం చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారం జిల్లాఅథ్లెటిక్స్ సంఘం బాధ్యులు వినతి పత్రం అందించారు. గత ప్రభుత్వ హయాంలో 6వరసల సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.6 కోట్ల నిధులను కేటాయించారని చెప్పారు. నిబంధనల ప్రకారం రాష్ట్ర, జాతీయ పోటీల నిర్వహణ చేయలేమన్నారు. ఈ నేపథ్యంలో నాటి కలెక్టర్ విపి. గౌతమ్ రూ.8కోట్ల మున్సిపల్ నిధులతో 8వరసల ట్రాక్ నిర్మాణానికి అనుమతులు జారీ చేశారని, ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. జిల్లాలో అథ్లెటిక్స్ క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించారని, సింథటిక్ ట్రాక్ నిర్మిస్తే మరింత మంది అథ్లెట్లు రాణించే అవకాశం ఉందని, మెరికల్లాంటి క్రీడాకారులు తయారవుతారని ఈసందర్భంగా మంత్రి తుమ్మలకు వివరించారు. దీంతో మంత్రి తుమ్మల స్పందిస్తూ స్టేడియంలో 8వరసల ట్రాక్‌నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు షఫీ, వెంకటేశ్వర్లు, నున్నా రాధాక్రిష్ణమల్లెంపాటి సత్యం, పుల్లయ్య, కోచ్ గౌస్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా

సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్

సత్తుపల్లిరూరల్, జనవరి9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రసరిహద్దు ప్రాంతమైన సత్తుపల్లిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ అన్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేం, పేకాట కేసుల్లోని పాత నిందితులను, కోడికత్తులు తయారీదారులు, కట్టేవారిని ఇప్పటివరకు 114 మంది మేజిస్ట్రేట్ ఎదుట గురువారం హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మరలా పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని, స్టేషన్ పరిధిలో కోడిపందేలు, జూదం నిర్వహణకు తోటలు, భూములు, గెస్ట్‌హౌస్‌లు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు తప్పవన్నారు. ఎక్కడైనా పేకాట, కోడిపేందులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి9(ఆంధ్రజ్యోతి):అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ ఆవిష్కరించారు.గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఈకార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్యయాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రియాదవ్, దుబాకుల శ్రీనివాస్, కనకబండి విజయలక్ష్మి, తోడేటి లింగరాజు, మేకల నాగేశ్వరావు, ముర్రిమేకల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్:కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆసంఘం రాష్ట్రకమిటీ సభ్యుడు మెరుగు సత్యనారాయణ, కొండం కరుణాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామంలో కల్లుగీత కార్మిక భవనంలో గురువారం క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు మొక్క శేఖర్‌గౌడ్, ఉపేందర్, సత్యం, ఆంజనేయులు, శ్రీను, కృష్ణయ్య, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా జయంతి

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి9(ఆంధ్రజ్యోతి): దేశ తొలిముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త ఫాతిమా షేక్ జయంతిని వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఖమ్మం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫాతిమాషేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో భూక్యా ఉపేంద్రబాయి,స్పందన, జ్యోతి, త్రివేణి, రావుల వెంకటేశ్వర్లు, బత్తిన శ్రీనివాస్, కవిత,ప్రమీల,భవాని,కృష్ణవేణి, సుజాత, రూన్నీ పాల్గొన్నారు.

పదోతరగతి ఫీజు చెల్లించేందుకు 21 వరకు గడువు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి9 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి వార్షిక పరీక్షల ఫీజు చెల్లించుటకు తత్కాల్ పద్ధతిలో రూ.1000 అపరాద రుసుంతో ఈ నెల 21 వరకు చెల్లించవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని వారు తత్కాల్ ఫీజుతో కలిపి చెల్లించవచ్చునని డీఈవో తెలిపారు.

మంత్రి తుమ్మల కృషితో సంక్షేమ పథకాలు

» 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ



ముఖ్యమంత్రి సహాయనిధి పత్రాలు పంపిణీ చేస్తున్న విజయ వెంకట రమణ

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో ఖమ్మంలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలేపు విజయ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం డివిజన్‌లోని లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, పత్రాలను అందించారు. సంక్షేమ కార్యక్రమాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.

మాజీ ఎమ్మెల్యే కందాళ జన్మదిన వేడుకలు



కూసుమంచిలో కేకు కట్ చేస్తున్న నాయకులు

కూసుమంచి, జనవరి9(ఆంధ్రజ్యోతి): పాలేరు మాజీఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కూసుమంచిలో అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ సెంటర్లో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. మతాబులు కాల్చి అభిమానాన్ని చాటుకున్నారు. కందాళ హయాంలో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంటూరి శేఖర్, వేముల వీరయ్య, ఆసిఫ్‌పాష, బొక్క నర్సింహారెడ్డి,రాంరెడ్డి,రామకృష్ణయాదవ్, గోపి, నాగయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: కందాల ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి పంపిణీచేశారు. రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బి.వీరనర్స, ఆలస్యం నరాగేశ్వరావు, మంచానాయక్, బానోతు రవి, అలుదాసు ఆంజనేయులు, జగదీష్, వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరెడ్డి, బానోతు మోహన్, రామచంద్రు, కృష్ణ పాల్గొన్నారు.

ఔషధాల తయారీకి రఘునాథపాలెం చేపలు

» రాజమండ్రికి వాహనాల్లో తరలింపు



చేపలను గ్రేడింగ్ చేస్తున్న జాలరులు

రఘునాథపాలెం, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఊర చెర్వులో పెరిగిన పక్కెలు, చందమామలు, చిన్నచేపలను ఔషధాల తయారీకి వినియోగిస్తుంటారు. గురువారం రఘునాథపాలెం మండలంలోని రఘునాథపాలెం, వేపకుంట్ల చెర్వులలో చేపల కోసం రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా వ్యాపారులు వచ్చారు. వారితో పాటుగా చిన్న చేపలు పట్టే వలలను వెంట తీసుకొని వచ్చారు. వారే స్వయంగా చేపలను పట్టుకున్నారు. వేపకుంట్ల చెర్వులో 7బాక్స్‌లు, రఘునాథపాలెం చెర్వులో 10 బాక్స్‌ల చేపలను సేకరించారు. వాటిని క్యాటగిరి వారీగా విభజన చేసి కోల్డ్ బాక్స్‌ల ద్వారా రాజమండ్రికి ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు.ఒక్కో చేపల బాక్స్‌ను రూ.1,500కు కొనుగోలు చేశారు.

ముగ్గుల పోటీకి విశేష స్పందన

ఖమ్మంలీగల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో ముగ్గుల పోటీ నిర్వహించారు. సుమారు40మంది హాజరయ్యారు. ఈపోటీలో ప్రథమ బహుమతి ఉమారాణి, ద్వితియ బహుమతి కే.పావని, తృతియ బహుమతి స్వర్ణకుమారి సాధించారు.

పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

ఖమ్మంరూరల్: మండల పరిధిలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నట్లు జిల్లాకాంగ్రెస్ నాయకుడు తుంబూరి దయకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రియవిద్యాలం వద్ద పోటీలు జరుగుతాయని, విజేతలకు ప్రథమ,ద్వితీయ, తృతీయ, ఏడుకన్సోలేషన్ బహుమతులు పాల్గొన్న మహిళలందరికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గోనాలని కోరారు.

తిరుమలాయపాలెం: శనివారం మండలంలోని పిండిప్రోలుప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల స్థాయిలో ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకరరెడ్డి తెలిపారు. పాల్గొనే మహిళలు 10వతేదీన 4గంటలలోపు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రమాదపు అంచున శిలాఫలకాల నిర్మాణం

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి9 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించటంలో అధికార యంత్రాంగం కీలకంగా వ్యవహరిస్తోంది. ప్రొటోకాల్ నుంచి శిలాఫలకాలు ఏర్పాటు వరకు వారిదే బాధ్యత. అయితే ఖమ్మం నగరంలో రాష్ట్ర మంత్రులు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే శిలాఫలకాలు ప్రమాదపు అంచున ఉంటున్నాయి. డ్రెయినేజీలపైన, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో ఏర్పాటు చేయటంతో కార్యక్రమాలకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిదులు, కార్యకర్తలకు ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది. కేఎంసీ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వీటిని



ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో నిర్మాణం చేస్తున్న శిలాఫలకం

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టులు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శన జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎస్‌వీకెఎం పాఠశాలలో ఈపోటీ నిర్వహించారు.ఈ వివరాలను జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ తెలిపారు. జిల్లాకు చెందిన ఒక ప్రాజెక్టు జాతీయస్థాయికి, రెండు ప్రాజెక్టులు సౌత్‌ఇండియాకు, రెండు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు జగదీశ్వర్ తెలిపారు. జాతీయస్థాయి సైన్స్‌ఫేయిర్‌కు రెజోనెన్స్ పాఠశాల విద్యార్థి సీహెచ్ అనిత ప్రాజెక్టు ఫ్రూట్ ప్రెస్ లిఫ్ట్ జాకెట్ ఎంపికైంది. సౌత్ ఇండియాకు ప్రభుత్వ పాఠశాల బురదరాఘవాపురం పాఠశాల విద్యార్థిని మహిమ తయారు చేసిన మ్యాథమెడికల్ మోడలింగ్ ప్రాజెక్టు, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థి సత్యసాయి వివేకనంద తయారుచేసిన ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యూనికేషన్ ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో మొదటిస్థానం పొందిన బ్లూమింగ్ మైండ్స్ పాఠశాల విద్యార్థి తయారు చేసిన వ్యర్థ పదార్థా నిర్వహణ, ద్వితియస్థానం, యువాన్ పాఠశాల విద్యార్థి న్యాచురల్ ఫార్మింగ్ ప్రాజెక్టులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి సెమినార్‌లో త్రివేణి పాఠశాల విద్యార్థి హరిచెందన మెదటిస్థాయిలో నిలిచిందని తెలిపారు.



మధ్యాహ్న భోజన సామగ్రికి టెండర్ల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం పథకం వివిధ వంటసామగ్రి సరఫరా చేయుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఈ టెండర్లు ఈనెల 16నుంచి 20వతేదీలోగా టెండర్ ఫారాలు పొంది, 21నుంచి 24వ తేది నాటికి పూర్తిచేసిన టెండర్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఐకేపీ ఏపీఎం బదిలీ

బోనకల్,జనవరి9(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఏపీఎంగా పని చేస్తున్న పద్మలత బదిలీపై ఖమ్మం రూరల్ మండలానికి వెళ్లారు. ఆమెస్థానంలో కామేపల్లి మండలంలో ఏపీఎంగా పని చేస్తున్న కట్టా సురేందర్‌బాబు బోనకల్‌కు వచ్చారు. గురువారం బాధ్యతలను స్వీకరించారు.



జక్కంపూడి ఆశయాలు సాధించాలి: మంత్రి తుమ్మల



జక్కంపూడి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

తల్లాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జక్కంపూడి కృష్ణమూర్తి ఆశయాలు సాధించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని బిల్లుపాడు గ్రామంలో సొసైటీ మాజీ చైర్మన్, సీనియర్ రాజకీయ నేత జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతకుముందు మండల సరిహద్దు గ్రామమైన పినపాక వద్ద ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నల్లగొండ వెంకటేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, మారెళ్ల లక్ష్మణ్‌రావు, కాపా సుధాకర్, దుండేటి వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), జక్కంపూడి కిషోర్, చంద్రశేఖర్, సామినేని రామప్పారావు, దీవెల కృష్ణయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా అడవికి వెళ్లే రహదారి

» గండివాగుపై వంతెన నిర్మించాలని బురదరాఘవాపురం గ్రామస్థుల వినతి

ఏన్కూరు, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం గ్రామం నుంచి అడవికి వెళ్లే రహదారి అధ్వాన్న స్థితిలో ఉంది. వర్షాకాలంలో గ్రామ సమీపంలోని గండివాగు పొంగిపొర్లడంతో పాటు చెరువు అలుగు నీరు నిత్యం ప్రవహించడంతో రాకపోకలకు అడ్డంకిగా మారింది. ఈరహదారి గుండా హిందూ, మైనారిటీ శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనం, పోడు భూములు రైతులు, సీతారామ ప్రాజెక్టు, గ్యాస్ పైపులైన్, హైటెన్షన్ విద్యుత్ మరమ్మత్తు పనులకు వెళ్లాల్సి వస్తుంది. ఈరహదారిని 50 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈరహదారిని రానురాను రైతులు ఆక్రమించుకోవడం వల్ల ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న కొత్త మొత్తం రహదారి కంపచెట్లతో మూసుకుపోయింది. సుమారు మూడున్నర కిలోమీటర్లు 150మంది రైతుల 2వేల ఎకరాల సాగుభూమి రైతులు ఈ రహదారి గుండానే



బురదరాఘవాపురంలో గుంతలమయంగా ఉన్న రోడ్డు



పొలాలకు వెళ్లేందుకు అడ్డంకిగా ఉన్న గండివాగు

వెళ్లాల్సి వస్తుంది మోకాలలోతు గుంతలు ఏర్పడి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, వెళ్లలేని పరిస్థితి. పొలాలకు మందుకట్టలు, కూలీలు, పత్తి, మిర్చి పంటలను తీసుకురావడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. నల్లరేగడి భూముల కావడం వల్ల వర్షాకాలంలో కాలినడక కూడా కష్టంగా ఉంటుంది. గండివాగుపై వంతెన నిర్మించి రోడ్డుకు శాశ్వత నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు..

గండివాగుపై వంతెన నిర్మించాలి

● వడ్లముడి బాబురావు, బురదరాఘవాపురం



అడవికి వెళ్లే దారికి అడ్డంకిగా ఉన్న గండివాగుపై వెంటనే వంతెన నిర్మించాలి. 1500 ఎకరాల సాగుభూముల రైతులు ఈ దారి గుండానే ప్రయాణిస్తుంటారు. ఈరహదారికి ప్రభుత్వం నిధులు వెంటనే మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలి.

సభ్యత్వాల నమోదులో ఖమ్మం జిల్లా ముందంజ

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం



మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

సత్తుపల్లిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందంజలో నిలిచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం అన్నారు. సత్తుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కేతినేని హరీష్, కాకర్ల రంగారావు, పోట్రు వెంకట రామారావు, వినుకొండ రమేష్, చల్లగుళ్ల అప్పారావు, మల్లూరు మోహన్, భీరెడ్డి మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్జత్‌సింగ్ దలైవాల్‌కు రైతుసంఘం సంఘీభావం

» తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

వైరా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో 46రోజుల నుంచి నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత జగ్జత్‌సింగ్ దలైవాల్‌కు మద్దతుగా రైతు సంఘం జిల్లా వ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు నిర్వహిస్తుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని గండగలపాడులో బుధవారం రాత్రి జగ్జత్‌సింగ్ దలైవాల్ ప్రాణాలు కాపాడాలని కోరుతూ ఆయనకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. గండగలపాడులో స్వాతంత్ర్య సమరయోధుడు ఖాజా రాధాకృష్ణమూర్తి వర్ధంతి సభను నిర్వహించారు. పూర్ణకంటి దేవయ్య సంస్మరణ సభను కూడా జరిపారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు మల్లెంపాటి రామారావు, ప్రసాద్, మచ్చా మణి, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, వెంకటేశ్వరరావు, కిన్నెర మోతి పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి నిరసన

చింతకాని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సెల్ టవర్ ఎక్కి సుమారు రెండు గంటల పాటు ఓ వ్యక్తి నిరసన తెలిపిన ఘటన మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పామర్తి శ్రీను ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా అధికారులు శ్రీను ఇంటికి వచ్చారు. శ్రీను ఆధార్‌కార్డును పరిశీలించిన అధికారులు గతంలో నీకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైందని, సంబంధించిన నగదు కూడా బ్యాంక్ ఖాతాలో జమ అయినట్లు తెలిపారు. తనకు రాలేదని తెలపడంతో పరిశీలించిన అధికారులు గ్రామంలో అదే ఇంటి పేరు, వ్యక్తి పేరుతో ఉన్న పామర్తి శ్రీను ఖాతాకు నగదు జమ అయినట్లుగా గుర్తించారు. తన ఆధార్ నెంబర్‌పై మరో వ్యక్తి ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్నాడని శ్రీను తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు, ఎస్‌ఐ నాగుల్‌మీరాకు ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదును ఎస్‌ఐ పట్టించుకోవడం లేదని శ్రీను గురువారం రాత్రి 7 గంటల సమయంలో సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. అధికారులు, గ్రామ పెద్దలు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాత్రి 9 గంటల అనంతరం శ్రీను కిందకు దిగాడు.

మహిళలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

కారేపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వంలో మహిళలను అన్ని విధాలుగా ఆదుకుని బలోపేతం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. గురువారం మండలంలో ఆయన మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా బలపడాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట టీ క్యాంటీన్లు ఇందిర క్రాంతి పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తోడితలగూడెంలో ఇందిర క్రాంతి పథకం ద్వారా ఏర్పాటు చేసిన నాటుకోళ్ల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, డీటీ లక్ష్మి, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఎంపీవో రవింద్రప్రసాద్, ఎంఈవో జయరాజు, మహిళ కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రప్రకాష్, ఇమ్మడి తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

అంగన్‌వాడీలకు శాశ్వత భవనాలు కల్పిస్తాం

» ఎమ్మెల్యే మట్టా రాగమయి



కల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు కల్పిస్తామని సత్తుపల్లి ఎమ్మెల్యే డా క్టర్ మట్టా రాగమయి అన్నారు. మండల పరిధిలోని పుల్లయ్యబంజర గ్రామంలో గురువారం అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, ఏసీడీపీవోలు రత్తమ్మ, మోహరున్నీసాబేగం, సూపర్‌వైజర్ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకరచౌదరి, తక్కెళ్లపాటి ప్రసాద్, కిష్టం శెట్టి కొండలు, రంగు లక్ష్మణరావు, బుర్రి వీరయ్య, పెద్దబోయిన శ్రీనువాసరావు తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు...

సత్తుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. సింగరేణి ఆధ్వర్యంలో స్థానిక ద్వారకాపూరి కాలనీలో నూతనంగా నిర్మించిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. మునిసిపాలిటీ పరిధిలో అన్ని వార్డులలో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు సింగరేణి సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీవో ప్రహ్లాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లాడలో ....

తల్లాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పర్యటించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. నారాయణపురం, గొల్లగూడెం, తల్లాడల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.చంద్రమౌళి, ఎస్ఐ బి.కొండల్‌రావు, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాచౌదరి, మాజీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా, సుధాకర్, ఎం.ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, జక్కంపూడి కిషోర్, రాయల రాము, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిరటౌన్, జనవరి9(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాయకుడు వంశీ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మధిర రూరల్ ఆత్కూరు గ్రామానికి చెందిన పి.ప్రమీలకు రూ.60వేల విలువ గల చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, రవి, బాలరాజు, జహంగీర్, సత్యానందం పాల్గొన్నారు.

'సంప్రదాయాలను మరవద్దు'

సత్తుపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను ఎప్పటికీ మరువరాదని, భారతదేశం అన్ని దేశాల సంప్రదయాలకు మూలమని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతిని నిర్వహించారు. విద్యార్థులకు ఆటపాటలు, రంగవల్లులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కొప్పుల తులసి, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, పద్మజ్యోతి, టీ.శ్రీదేవి, కే.నిరోష, జీ.ఆషారాణి, కే.సుజాత, సీహెచ్.పావని పాల్గొన్నారు.

రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా: సీఐ కిరణ్

సత్తుపల్లిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సత్తుపల్లిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని సత్తుపల్లి పట్టణ సీఐ టీ.కిరణ్ అన్నారు. ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేం, పేకాట కేసుల్లోని పాత నిందితులను, కోడికత్తులు తయారీదారులు, కట్టేవారిని ఇప్పటి వరకు 114మంది మేజిస్ట్రేట్ ఎదుట గురువారం హాజరుపరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా వారికి కౌన్సిలింగ్ నిర్వహించి మరలా పట్టుబడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు

కల్లూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఖమ్మానికి చెందిన వైద్యులచే ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఖమ్మం దంత వైద్యురాలు కిన్నెర రోజారమణి ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు రోజారమణి మాట్లాడుతూ తాను ఈ పాఠశాల పూర్వ విద్యార్థిగా సేవలందించాలన్న సంకల్పంతో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాటి గురువు ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం వి. పద్మను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరక రామారావు, రమాదేవి, ఎం వెంకటేశ్వరరావు, చల్లా అనితకుమారి, ఫణీ శంకర్‌రెడ్డి, వేణి తదితరులున్నారు.

అధికలోడును అధికమించేందుకే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

» డీఈ నంబూరి రామారావు

కొణిజర్ల, జనవరి9(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో లోడును అధికమించేందుకు కొణిజర్ల మండలంలో రూ. 8.5 లక్షలతో అంచనాలు వేసి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ నంబూరి రామారావు తెలిపారు. మండలంలోని అనంతారం, అన్నవరం, పెద్దమునగాల గ్రామాలలో ఏర్పాటు చేసిన నాలుగు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను గురువారం డీఈ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ వినియోగం పెరగటం వలన సమ్మరయాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రస్తుతం ఉన్న 15కేవి ట్రాన్స్‌ఫార్మర్‌లపై లోడు అధికమించేందుకు 4 సింగిల్ ఫేస్ 25కేవి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ తిలక్, ఏఈ రాయల సురేష్ పాల్గొన్నారు.

'రుణాలను సకాలంలో చెల్లించాలి'

చింతకాని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించి, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 3 శాతం వడ్డీ రాయితీ పొందాలని యూనియన్ బ్యాంక్ ఖమ్మం రీజనల్ మేనేజర్ హనుమంతరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో ఖాతాదారులకు బ్యాంక్ లావాదేవీలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ రుణాల ఇన్‌చార్జి లక్ష్మి నర్సయ్య, బస్వాపురం బ్యాంక్ మేనేజర్ ఆర్ దయాకర్, సిబ్బంది బాలకృష్ణ, వెంకట చారి, శంశుద్దీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

వైరా, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆక్లబ్ డిస్ట్రిక్ట్ పాస్ట్‌గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆర్థికసాయంతో స్థానిక ప్రభుత్వ హైస్కూల్లోని పది విద్యార్థులకు అల్పాహార కార్యక్రమాన్ని గురువారం ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పదోతరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ అల్పాహారాన్ని అందిస్తున్నామని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు జి.మాధవరావు, ఉపాధ్యాయులు అనితాదేవి, చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, మరికంటి రాంగోపాల్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది

» డాక్టర్ మట్టా దయానంద్



రూ.50వేల నగదు అందిస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తాను విద్యాబుద్దులు నేర్చుకున్న ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాముడిని అవ్వడం ఆనందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. తన మాతృమూర్తి డాక్టర్ మట్టా ఆరోగ్యమ్మ జ్ఞాపకార్థం ఆమెను స్మరించుకుంటూ స్థానిక పాతసెంటర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రూ.50వేల నగదును గురువారం అందజేశా రు. ఈ నగదుతో ప్రతిఏటా ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు బహుమతులను అం దించేందుకు వినియోగించాలని కోరారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధి నిమ్మితం రూ.5లక్షల నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని ప్రకటించారు. మీరు ఉత్తములుగా ఎదిగిన తర్వాత ఎక్కడున్నా సరే సంతోషించేంది ఉపాధ్యాయులేనని, విద్యాబుద్దులు నేర్పించే సమయంలో కఠినంగా వ్యవహరించే ఉపాధ్యాయులను ఎప్పుడూ మరువద్దన్నారు. సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు పాఠశాలకు మంచి పేరుతో తేవాలని విద్యార్థులను కోరారు.

కార్యక్రమంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్‌ఎం శైలకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముందుగా ఆయన స్వగృహంలో డాక్టర్ మట్టా ఆరోగ్యమ్మ చిత్రపటానికి సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు బాణాపురం విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ముదిగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో శుక్రవారం నుంచి జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు బాణాపురం విద్యార్థినులు ఎంపికైనట్టు హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో తమ పాఠశాలకు చెందిన ఐషాని, శ్రీనిధి, స్పందన, వేదిత, దేవి స్పందనలు అర్హత సాధించారు. ఈనెల పదో తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగులు



తల్లాడ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడిగా చల్లా నాగులు ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం నాగులు ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు.

ఐకేపీ ఏపీఎం బదిలీ

బోనకల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఏపీఎంగా పని చేస్తున్న పద్మలత బదిలీపై ఖమ్మం రూరల్ మండలానికి వెళ్లారు. ఆమె స్థానంలో కామేపల్లి మండలంలో ఏపీఎంగా పని చేస్తున్న కట్టా సురేందర్‌బాబు బోనకల్‌కు వచ్చారు. గురువారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్ర భవనానికి పెయింటిగ్స్ వితరణ

బోనకల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామంలో ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్ర భవనానికి గురువారం సొసైటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు మేనల్లుడు లేళ్ల కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా లేళ్ల మోనా కుమారి పెయింటిగ్స్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటీ స్వాతి, కావ్య, మారుపల్లి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ఎర్రుపాలెం, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేమిడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వేచ్ఛ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను గురువారం అందించారు. ఈసందర్భంగా ఆసంస్థ కార్యదర్శి డాక్టర్ చల్లా కోటయ్య మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు స్టడీ మెటీరియల్ ద్వారా సిలబస్‌ను సరళీకృతం చేసుకోని, ఎక్కువ మార్కులు సాధించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొలికపోగు శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ నాళ్ల భానుచందర్, నక్క వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

బోనకల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం పీఆర్టీయూ సంఘ డైరీలను ఎంఈవో దామాల పుల్లయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ విద్య బలోపేతానికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొనకంచి రామ్మోహన్, మాదినేని వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు కొమ్ము శ్రీనివాసరావు, చింతల రవికుమార్, దుర్గాప్రసాద్, గంటేల ఝాన్సీ, ఆర్ వెంకటేశ్వర్లు, రత్నాకర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

పెనుబల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్ గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ప్రసాద్‌కు కాం గ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రసాద్‌తోపాటు వీఎంబంజర్ తాజా మాజీ సర్పంచ్ భూక్యా పంతులీతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సోమరాజు సీతారామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ వంగా ఝాన్సీనిరంజన్‌గౌడ్, మిట్టపల్లి కిరణ్‌కుమార్, వంగా దామోదర్‌రావు, గోగినేని రమేష్, మేకతొట్టి కాంతయ్య, శంకర్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు వితరణ

ముదిగొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం వల్లాపురం గ్రామపంచాయతీకి గురువారం ఫ్రీజర్ బాక్సును వితరణ చేశారు. గ్రామానికి చెందిన తాటికొండ నారాయణ, గౌరమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అనంతయ్య, వెంకటేశ్వర్లు, రమేష్ రూ.1.10 లక్షల విలువ కలిగిన ఫ్రీజర్‌బాక్సును తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి చేతులమీదుగా గ్రామపంచాయతీకి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రవచనాలు

పెనుబల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాలపాడు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం తిరుమల తిరుపతి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రవచనకర్త నల్లానుల చక్రవర్తుల సీతారామాంజయ స్వామి భక్తులకు ప్రవచనాన్ని బోధించారు. కార్యక్రమంలో సోమరాజు శివ రాంప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత

మధిర రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం వంగవీడు-సిరిపురం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు సమీపంలోగల ఎన్నెస్పీ కాల్వను తవ్వి మట్టిని తరలిస్తుండగా గురువారం రాత్రి వంగవీడు గ్రామస్థులు అడ్డుకున్నారు. సిరిపురం సమీపంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద వంగవీడు వైపు వెళ్లే సాగర్ కెనాల్‌ను పెద్ద ఎత్తున తవ్వి టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వంగవీడు గ్రామస్థులు రాత్రి 7గంటల సమయంలో ఎన్నెస్పీ కాల్వ వద్దకు చేరుకొని మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. రైతులు అక్కడి నుంచే అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రైతులు బొగ్గుల వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న మధిర ఆర్ఐ ఎన్నెస్పీ కెనాల్ వద్దకు చేరుకొని మట్టి తవ్వకాలను పరిశీలించారు. కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

బోనకల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఎంఈవో దామాల పుల్లయ్య ఆధ్వర్యంలో ఫ్యానల్ టీం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని పర్యవేక్షించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు తనిఖీ చేసి నివేదికను అందజేయనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

ఎర్రుపాలెం, జనవరి9(ఆంధ్రజ్యోతి): జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ(ముక్కోటి) ఏకాదశికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు గురువారం ఒకప్రకటనలో తెలిపారు.

సత్తుపల్లిరూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, గీతామందిరం, రేజర్లలోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.